# ఆల్ అబవుట్ వుత్తరాలు

'ఒంటరితనంలో కంపెనీ పొందడమే వుత్తరం రాయడం అంటే' అన్నాడు లార్డ్ బైరన్.

కలం స్నేహం అనే ప్రక్రియ ఈ ప్రిన్స్‌పల్ ఆధారంగానే వచ్చింది.

అక్షరజ్ఞానంగల ఏ మనిషయినా చచ్చేలోగా కనీసం ఒక్క వుత్తరమయినా రాయకుండా వుండడు. పుట్టింటికెళ్ళిన భార్యకో, స్నేహితులకో, వుద్యోగానికి దరఖాస్తో.... ఉత్తరం ప్రతివాళ్ళ జీవితంలో తప్పనిసరి అంశం. కొందరు లెటర్స్‌ని రాయడంలో ఎంతో ఆనందం అనుభవిస్తారు కూడా.

రాత్రి ఇంటిల్లిపాది నిద్రపోయాకో లేదా తెల్లవారు ఝామునో కాగితాల ముందు కూర్చుని బోలెడంత వుత్తరం రాస్తేకాని లెటర్ రాసిన తృప్తిని పొందలేరు. మరి కొందరికి వుత్తరం రాయడం అంటే అయిష్టం. దాన్ని 'బద్ధకం'గా బయటికి చెప్పినా తలమీదకి వస్తేకాని వారు కార్డు, కలం ముట్టరు.

నిజానికి వుత్తరం రాయడం కన్నా దాని కోసం ఎదురు చూడటంలో ఎంతో థ్రిల్లు వుంటుంది. రోజూ పోస్ట్‌మాన్ వచ్చేటైంలో అతని కోసం ఎదురు చూస్తుంటారు అనేకమంది. అతను కనబడితే 'వుత్తరం వుందా?' అని అడగని వారు అరుదు, వుంటే ఇవ్వకపోడని తెలిసినా. కొందరు సరాసరి పోస్టాఫీసుకి వెళ్ళి పోస్ట్‌మేన్‌ని అడిగి లెటర్స్ తెచ్చుకుంటూంటారు, అతను ఇంటికి వచ్చేదాకా ఆగలేక. సాధారణంగా ఈ కోవకి చెందినవారు వుద్యోగానికి అప్లికేషన్ పెట్టిన నిరుద్యోగులో, ప్రేమలేఖలు ఇంట్లోని వాళ్ళ కళ్ళబడకూడదనుకునే వారో లేదా రిటైరై ఏమితోచని ముసలివాళ్ళో అయి వుంటారు. కొన్ని వుత్తరాలు చదివి పక్కన పారసేవయితే కొన్ని మళ్ళీ మళ్ళీ చదవాలనిపించేవిగా వుంటాయి. లెటర్ రైటింగ్ కూడా ఓ కళ అని వప్పుకోక తప్పదు.

కొందరు 'శని, ఆది కలిసి వస్తున్నాయి కాబట్టి సోమవారంనాడు శెలవ పెట్టి ఇంటికి రా, అమ్మ పచ్చళ్ళు పెట్టింది. తీసుకెళ్ళచ్చు' అని వున్న విషయం కట్టె, కొట్టె, తెచ్చె అన్నట్లు రాస్తే మరికొందరు ఆ విషయాన్ని ఇంకా స్త సున్నితంగా, హాస్యంగా చెప్తారు.

'ఒరేయ్, నిన్ను చూసి చాలా కాలం అయింది. నువు అమ్మ పెట్టిన పచ్చళ్ళు తిని చాలా కాలం అయింది. సోమవారం శెలవు పెడితే శని, ఆది కలిసి వస్తాయి కాబట్టి ఓసారి వచ్చెళ్ళు. శెలవుంటే మంగళ వారం కూడా వుండేట్టుగా రా. ముఖ్యంగా రాసేదేమంటే నువు ఆలస్యం చేస్తే పచ్చళ్ళకి మీసాలు రావచ్చు. (బూజన్నమాట). అలా రాకపోతే అవి నువ్వొచ్చే నాటికి మిగలకపోవచ్చు. ఆనక నీ ఇష్టం....' ఇలా కూడా రాయచ్చు ఆ గొలుసుకట్టు వాక్యాలనే.

లెటర్స్ రాయడం బద్ధకం ఆయినవాళ్ళకి కొన్ని చిట్కాలు. చిన్న లెటర్ క్లుప్తంగారాసి పంపుతూ దానితోపాటు దినపత్రికలోని ఆసక్తికరమైన వార్త తాలూకూ కటింగ్స్ (అమెరికాలో కుక్కల యజమానులు విదేశాలకు వెళ్ళినప్పుడు వాళ్ళ కుక్కల్ని చూసుకోడానికి కేర్ టేకర్ హోటల్ వెలిసింది. లేదా తన భార్య బంధుమిత్రులు తనింటికి వచ్చి వున్నందుకు విడాకులు కోరితే మంజూరయ్యాయి ఆ బంధువుల సంఖ్య 27. గత 14 ఏళ్ళగా వాళ్ళు ఆ ఇంట్లోనే మకాంట.... లాంటివి) లేదా కొత్త వంటకాలు, సినిమా రివ్యూలు లాంటివి పంపవచ్చు. ఎవరికి ఏ అంశం ఆసక్తి కలిగిస్తే వారికి అవి పంపుతూ, 'అది చదవగానే నాకు నువ్వు గుర్తొచ్చావు కాబట్టి పంపుతున్నాను.' అని ఒక్క వాక్యం రాసినా చాలు. పెద్ద వుత్తరం చదివినంత సంతోషపడతారు. లేదా ఓపిక వుత్సాహం వున్న వాళ్ళకి ఓ కార్డు మీద లెటర్ రాసి, దాన్ని అనేక ముక్కలుగా కట్ చేసి కవరులో పంపితే వాటిని పేర్చి చదువుకోవడంలో థ్రిల్ అనుభ వించచ్చు, మేగజైన్‌లో కళ్ళమీద వచ్చిన ప్రత్యేక ఆర్టికల్‌ని కళ్ళ డాక్టర్ బంధువులకి పంపచ్చు. కవరు పట్టని పెద్ద గ్రీటింగ్

కార్డుని పజిల్‌లా కట్‌చేసి కవర్లో పెట్టి పంపితే దాన్ని అసెంబిల్ చేసి చూసుకునే వుత్సాహం, తీరిక వున్నవారిని అది ఆనందింప జేస్తుంది. పత్రికల్లో వచ్చే చక్కటి జోక్స్, కార్టూన్స్ కూడా కట్‌చేసి పంపచ్చు.

ఉత్తరం రాగానే సమాధానం రాయడం అంటే, ఎవరయినా మనింటికొచ్చి తలుపుకొడితే దాన్ని తెరిచాక చిరునవ్వుతో 'లోపలికి రండి' అనడం లాంటిది. అలా అనడం ఆలస్యం చేస్తే వారు లోపలికి రాకపోవచ్చు. అలాగే ఆలస్యంగా జవాబిస్తే మళ్ళీవాళ్ళు రాయకపోవచ్చు. దీన్నే ఏపిల్ పళ్ళతో పోల్చవచ్చు. సమాధానం రాయడం ఇంట్లో ఏపిల్స్ వుంచుకుని తినడం లాంటిది. తినడం ఆలస్యం చేస్తే ఏపిల్స్ ఎలా కుళ్ళిపోతాయో సమాధానం రాయడం ఆలస్యం చేస్తే అలాగే ఆ సమాధానం, నిరుపయోగం అవుతుంది.

అలా ఆలస్యంగా ఎవరికయినా పుత్తరం రాసేవాళ్ళకో సూచన. కొద్దిపాటి లౌక్యం ప్రదర్శించాలి వుత్తరంలో. ఉదాహరణకి వుత్తరం ఇలా ప్రారంభించవచ్చు. 'నీకు వుత్తరం రాసేంత పెద్ద విశేషాలేం జరగక, నీకు రాద్దామనుకుంటుంటే ఎప్పటికప్పుడు వుత్తరం రాయనీయకుండా ఎన్నో చిన్న సంఘటనలను జరగబట్టి ఇంతదాకా రాయలేకపోయాను. ఇప్పుడు ముఖ్యంగా రాసేదేమిటంటే....

ఓ తండ్రి పట్నంలో వుండి చదువుకునే తన కొడుక్కి ఇలా లెటర్ రాసాడు. 'ఈ వుత్తరంతో పాటు అయిదు వందల రూపాయలకి డి.డి.ని జత చేస్తున్నాను. పండగలకి బట్టలు కొనుక్కో' ఆ కొడుకు నుంచి తిరుగు టపాలో జవాబు వచ్చింది. 'నాన్నగారు. నేను కులాసా. అక్కడంతా క్షేమం అని తలుస్తాను. మీరు మీ వుత్తరంతో పాటు డి.డి.ని పంపడం మరిచారు' అని రాస్తే, వెంటనే ఆ తండ్రి దానికి సమాధానం రాస్తూ 'ఒరేయ్ వెధవాయ్. డి.డి. లేదు, పాడు లేదు. నీనించి సమాధానం రాలేదు కాబట్టి నీ క్షేమం తెలుసుకోడానికి నేనేసిన ఎత్తు అది' అని రాశాడు.

మరో తండ్రి పట్నంలో చదువుకునే కొడుక్కి వెయ్యిరూపాయలు పంపమని రాసిన లెటర్‌కి జవాబు రాస్తూ 'నాన్న, బాగా చదువుకో. పెద్ద

వుత్తరాలు అన్నీ విశేషాలతో రాస్తూండు. ఊరికూరికే డబ్బు కావాలని నా ప్రాణాలు తోడేయకు. నువు కోరిన వంద రూపాయలకి డి.డి.ని జత చేస్తున్నాను. అన్నట్లు నీ లెటర్లో చిన్న తప్పు రాసావు. వందకి ఒకటి పక్కన రెండు రెండు సున్నాలు పెడితే చాలు. మూడు సున్నాలు 'పెట్టావు' అని రాసాడు.

ఈ రకమైన చమక్కులు వుత్తరం చదివే వారిని క్షణకాలం నవ్వించ గలిగినా చాలు.

కొన్ని వుత్తరాలు చాలా ఆలస్యంగా చేరినట్లుగా తరచు దినపత్రికల్లో వార్తలొస్తుంటాయి. ఆగస్టు 18, 1990 ఆంధ్రభూమిలో 'బటాలాలో 1966 డిసెంబర్ 22న ఓ వ్యాపారి పోస్ట్ చేసిన లెటర్ 24 సంవత్సరాల తర్వాత ఇటీవలే బట్వాడా అయిందని, ఆ వుత్తరంపై అణాస్టాంపు వుండటంతో రూపాయి బేరింగ్‌గా వసూలు చేసారన్న వార్త వచ్చింది. చిరునామాదారు గతించి చాలాకాలం అయింది. ఆయన వారసులు దాన్ని పెనాల్టి కట్టి తీసుకున్నారు, అనే వార్త వచ్చింది. దీన్ని కట్ చేసి దాచాను. నేను రిప్లై ఇవ్వని ఓ వుత్తరం రాసిన వ్యక్తి నన్ను కోప్పడుతూ ఇంకో లెటర్ రాస్తే, ఈ కటింగ్ అతనికి పంపుతూ 'నేను రాసిన జవాబు 24 ఏళ్ళ తర్వాత రావచ్చు. కోప్పడకు. రాసాను' అని జవాబు రాసాను. అది చదివాక అతను కోప్పడి నందుకు సారి చెప్తూ మళ్ళీ జవాబు రాసాడు.

ఉత్తరాలు బంధుమిత్రుల ఇళ్ళకు వెళ్ళే విజిట్స్ లాంటివి. అవి లేకపోతే వారికి దూరం అయి, ఎలాంటి బంధం లేకుండా మిగిలిపోతాం. విశేషాలు లేకపోయినా తరచూ ఓ కార్డుముక్క రాసి పడేస్తుండటంవల్ల జీవితకాలంలో ఎన్నడో ఓ సారయినా ఇది వుపయోగపడుతుంది. 'ఉత్తరం' అనే సౌకర్యం లేకపోతే ఎన్నో ప్రేమలు విజయవంతం అయ్యేవి కావు. 'ప్రేమ లేఖ'ల వల్లే ప్రేమ అభివృద్ధి చెందిన జంటలు కోకొల్లలు. లేఖ ఓ పదమయితే 'ప్రేమలేఖ' ఓ అందమయిన పదం.

(ప్రేమలేఖల నమూనాలు నా నాన్-ఫిక్షన్ 'ప్రేమ పుస్తకం'లో చాలా ఇచ్చాను. ఇలాగే శుభలేఖల నమూనాలు 'పెళ్ళి పుస్తకం'లో

ఇచ్చాను.)

ఒకప్పుడు కాత్యాయని అనే అమ్మాయి నాకు ఎంతో పెద్ద ఉత్తరాలు రాస్తూండేది. ఓ వారం ఆ లెటర్ రాకపోతే ఆ వెలితి ఫీలయ్యే వాణ్ణి. దగ్గరుండి కబుర్లు చెప్పినట్టుగా పెద్ద ఉత్తరాలు ఎంతో ఆసక్తిగా చదివించేలా రాసేది. కొంత కాలం లెటర్స్ ఆగిపోయాయి. ఓసారి ఓ పెద్ద కాగితంలో ఒకే ఒక వాక్యం రాసాను. 'పలుకే బంగారమాయెనా?' అని. మళ్ళీ లెటర్స్ రాసాగాయి.

లెటర్స్ రచయితల వృత్తిలో (లేదా హాబీలో) ఓ భాగం. రచనలు చదివి, వాటి బాగోగులు గురించి రాస్తూంటారు. తప్పని సరిగా సమాధానం ఇస్తేనే ఆ పాఠకుడు తనని రచయిత గౌరవించాడు అనుకుంటాడన్న నమ్మకంతో నేను అందరికీ రిప్లై ఇస్తూంటాను. ఇలా వారానికి 70 నించి 90 ఉత్తరాల దాకా సమాధానాలు రాస్తున్నాను 1979 నుంచి. పబ్లిక్‌తో టచ్ వున్న ప్రతి వ్యక్తి సమాధానాలు రాయడం బాధ్యతగా తీసుకోవాలి.

ఉత్తరానికి క్యూసిస్టంలో సమాధానం రాయడంగురించి రాజమండ్రి నించి లలిత అనే అమ్మాయి ఇలా రాసిందోసారి నాకు. 'అనగాగనగా ఓ రాజుగారు బుట్టెడు మామిడి పళ్ళు తెప్పించుకున్నాడు. ఒకటి పండితే ఇంకోటి కుళ్ళింది. రాజు పాడయిన భాగం తీసేసి మిగతాది తిన్నాడు. మర్నాడు మరో పండు కుళ్ళింది. ఇంకొకటి పండింది. ఆరోజు అలాగే చేసాడట. ఇలా అవి అయేదాకా మంచిపండు తినలేదా రాజు. పాపం కుళ్ళిన పళ్ళలోని మంచి భాగం తిన్నాట్ట. అలా మూడు నెలల తర్వాత సమాధానం ఇస్తుంటే పాఠకులు తిట్టుకోరూ?'

అన్ని ఉత్తరాల్లో అత్యంత ఆనందానిచ్చేవి పర్సనల్ లెటర్సే. ఆఫీసులో ఆఫీసర్ పిలిచి మీ కొచ్చిన పర్సనల్ లెటర్ ఇచ్చి, దాన్ని వెంటనే చదువుకోనీకుండా ఆఫీసు వ్యవహారం మీద మిమ్మల్ని ఆపేశాడనుకోండి. అప్పుడు ఆ ఆఫీసర్ ఓ దున్నపోతు కింద లెక్క.

'దూరం' నవల కేవలం ఉత్తరాలతో రాసాను, రచయిత నేరేషన్ ఎక్కడా లేకుండా. ఉత్తరాలు చదవడం నచ్చే అందరికి ఆ నవల

నచ్చింది. అసలు ఏ ఉత్తరం ఆసందాన్నిస్తుందో తెలుసాండి? పాత ఉత్తరం. ఎందుకంటే దానికి సమాధానం ఇవ్వాల్సిన అవసరం వుండదుగా.

# 'లా'స్ అబవుట్ మదర్–ఇన్–లా

'ఒక కప్పు కింద రెండు కొప్పులొప్పవు' అని మన పూర్వీకులు సింపిల్‌గా చెప్పారు. నిజమే. ఓ ఇంట్లో ఇద్దరాడవాళ్ళుంటే ఆ ఇంటి మగడికి దిన దిన గండం. నూరేళ్ళాయుష్షు. ముఖ్యంగా ఆ మరో కొప్పు సాక్షాత్తు అత్తగారయితే ముందు నుయ్యి, వెనక గొయ్యి చందం అవుతుంది. అఫ్‌కోర్స్. ఈ మొదటి పేరాగ్రాఫ్ మనదేశస్థులకన్నా పాశ్చాత్య దేశస్థులకి అధికంగా వర్తిస్తుంది.

భార్య, భర్త, అత్తగారు.... ఈ మూడు కలిసిన చోట పోట్లాటలు మనస్పర్థలు అమెరికాలో తప్పవు. కొన్ని సందర్భాల్లో ఈ ముగ్గురిలో ఎవరో ఒకరు కోర్టు గుమ్మం ఎక్కకుండా వుండలేరు. అమెరికాలో ఈ ముగ్గురి మధ్య గల వివాదాన్ని అనేక రాష్ట్రాల కోర్టులు పరిష్కరిస్తూ తీర్పునిచ్చాయి, ఆ వివాదం, ఆ తీర్పులు మనకి గమ్మత్తుగానే వుంటాయి.

వాటిలో కొన్ని పరిశీలిద్దాం.

నెబ్రెస్కా సుప్రీం కోర్టు :

ఓ తల్లి తన కోడలిని తన కొడుకు ఇంట్లో అవమానిస్తే అది ఎవరి తప్పు?

—భర్తదే. అంటే ఆ తల్లి కొడుకుదే. తన భార్యతో సఖ్యతగా లేని తల్లినీ ఏ భర్త తనింటికి రానివ్వకూడదు.

ఇల్లినాయిస్ సుప్రీం కోర్టు: